నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 3 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



నస్పూర్‌కాలనీలోని టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి


సీసీసీ నస్పూర్ : నస్పూర్‌కాలనీలో బతుకమ్మలతో వచ్చిన మహిళలతో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి


ఆసిఫాబాద్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ సురేశ్‌కుమార్, అధికారులు



రెబ్బెన : గోలేటిలో తెలంగాణ రన్‌లో పాల్గొన్న ఏరియా జీఎం రవిప్రసాద్, అధికారులు, యూనియన్ నాయకులు


నస్పూర్ : కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

# అట్టహాసంగా ఆవిర్భావోత్సవం

## మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు

- జాతీయ జెండాలు ఎగరేసిన కలెక్టర్లు సంతోష్, వెంకటేశ్ ధోత్రే

## ర్యాలీలు.. జై తెలంగాణ నినాదాల హోరు


మంచిర్యాలటౌన్ : మంచిర్యాలలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ అశోక్‌కుమార్


ఆసిఫాబాద్‌లో జెండా వందనం చేస్తున్న అధికారులు, సిబ్బంది

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/మంచిర్యాలటౌన్, జూన్ 2 : మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. మంచిర్యాలలోని అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ అశోక్‌కుమార్, ఆర్డీవో రాములు, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాశ్, వెంకటేశ్వర్ పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. అనంతరం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయాల ప్రాంగణంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ సురేశ్‌కుమార్, జడ్పీ చైర్మన్ కృష్ణారావుతో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎందరో అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందన్నారు. గోలేటిలో తెలంగాణ కోసం కొట్లాడి జైలు జీవితం గడిపిన ఉద్యమకారులు అజ్మీర బాబురావు, బోగే ఉపేందర్, వినోద్‌జైస్వాల్, దుర్గం రవీందర్, తోట లక్ష్మణ్, వామన్‌ను గోలేటి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు వసీం, మొయిజ్, హుస్సేన్ సన్మానించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. సింగరేణిలో జీఎంలు, అధికారులు, నాయకులు, కార్మికులు వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీలు తీశారు. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు.


రెబ్బెన : తెలంగాణ ఉద్యమకారులను సన్మానిస్తున్న గోలేటి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు


చెన్నూర్ రూరల్ : కిష్టంపేటలో లేచిపోయిన రేకులు


పెంచికల్‌పేట్ : కొండపల్లిలో పిడుగుపడి కాలుతున్న తాడిచెట్టు


బెజ్జూర్ : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై విరిగిపడ్డ వృక్షం

# గాలివాన బీభత్సం

- ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో లేచిపోయిన ఇళ్ల పై కప్పు రేకులు
- పలుచోట్ల స్తంభాలు పడిపోయి నిలిచిన విద్యుత్ సరఫరా
- రోడ్లపై చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ● పిడుగులు పడి బర్రె, 18 మేకలు మృత్యువాత
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం


బెజ్జూర్ : విరిగి పడ్డ విద్యుత్ స్తంభం


మంచిర్యాలటౌన్ : రెడ్డికాలనీలో విరిగి పడ్డ చెట్టుకొమ్మలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది


బెజ్జూర్ : విద్యుత్ తీగల పై విరిగి పడ్డ చెట్టు


వేమనపల్లి : జిల్లెడలో పిడుగు పడి మృతి చెందిన బర్రె

బెజ్జూర్/పెంచికల్‌పేట్/దహెగాం/ఆసిఫాబాద్ టౌన్/వాంకిడి, జూన్ 2 : ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఆఫాబాద్‌లో ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా వర్షం కురిసింది. గుండి పెద్దవాగులోని తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. బెల్గాం గ్రామంలో లోనారే హనుమంతుకు చెందిన 10 మేకలు పిడుగుపడి మృతి చెందాయి. బెజ్జూర్ మండలకేంద్రంలోని వారసంతలోగల గుడారాలన్నీ గాలికి లేచి పోయాయి. బెజ్జూర్‌తో పాటు ఊరి పొలిమేరలో భారీ వృక్షాలు కూలిపోగా, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల దుకాణాలు, ఇండ్ల పై కప్పు రేకులు లేచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సబ్‌స్టేషన్ నుంచి మండల కేంద్రానికి సరఫరా అయ్యే విద్యుత్ తీగలపై వృక్షం కూలగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పెంచికల్‌పేట్ మండలం కొండపల్లిలో తాడిచెట్టుపై పిడుగుపడడంతో చేలల్లో ఉన్న వారంతా పరుగులు తీశారు. ఎల్కపల్లి, లోడ్పల్లి గ్రామాల్లో రాళ్లవాన కురిసింది. వ్యాపార సముదాయాలు రెండు గంటలపాటు మూసివేశారు. దహెగాంలో ఇండ్ల పై కప్పు రేకులు లేచిపోయాయి. వాంకిడి మండలం ఇందానికి దుర్గం విక్రుబాయి(55) ఇంటి సమీపంలోని చెట్టుపై పిడుగు పడగా, ఒక్కసారి ఆ శబ్దానికి సొమ్మసిల్లి పడిపోయింది. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని హాస్పిటల్‌కు తరలించారు. మోకాసీ గూడలో ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి.

మంచిర్యాలటౌన్, జూన్ 2 : పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో పాటు వేగంగా గాలులు వీచాయి. రెడ్డికాలనీ, పాతమంచిర్యాల, బృందావన్‌కాలనీ, హనుమాన్‌నగర్‌ల్లో చెట్లకొమ్మలు విరిగి రోడ్లకు అడ్డుగా పడగా, మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

జన్నారం, జూన్ 2 : కలమడుగులో సిటనోజు రాజన్న, శ్యామల ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. పిడుగు పడడంతో చాకచక్యంగా తప్పించుకున్నారు.

చెన్నూర్/చెన్నూర్ రూరల్, మే 2 : చెన్నూర్‌లో మధ్యాహ్నం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని ఓ మోస్తారు వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. చెన్నూర్ మండలం కిష్టంపేటలో చెన్నూర్–మంచిర్యాల ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కిష్టంపేటలో ఇంటి పైకప్పు లేచి రేకులు విరిగిపడ్డాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.

వేమనపల్లి, జూన్ 2 : జిల్లెడ గ్రామ సమీపంలో దాసరి పోచయ్యకు చెందిన గేదె మేత మేస్తుండగా, పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ. 30 వేలు ఉంటుంది. నీల్వాయిలో చెట్టు మండ విరిగి కరెంటు తీగలపై పడడంతో ట్రాన్స్‌ఫార్మర్‌తో సహా మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భీమయ్య ఇల్లు పై కప్పు రేకులు గాలికి ఎగిరిపోయాయి. ముక్కిడిగూడెం సమీపంలోని ముత్యాలమ్మ ఆలయ పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలోరైతుల ధాన్యం తడిసిపోయింది. నీల్వాయి, దస్నాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. రెండు రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆందోళనలు చేపడుతామని రైతులు హెచ్చరించారు.

కన్నెపల్లి, జూన్ 2 : కన్నెపల్లి మండలం నాయకునిపేట పంచాయతీలోని మొక్కపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి 8 మేకలు మృత్యువాత పడ్డాయి. మేతకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా, పిడుగు పడడంతో గాదర్ల మహేశ్, పెద్దల రాజయ్య, బైరి గట్టన్న, పోసు, గట్టయ్యకు చెందిన ఒక్కో మేక, గాదర్ల కొమురయ్యకు చెందిన మూడు మేకలు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ. 1.20 లక్షల దాకా ఉంటాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.


బెజ్జూర్ : వారసంతో లేచిపోయిన రేకులను సరిచేస్తున్న యజమానులు


ఆసిఫాబాద్ టౌన్ : జెండాగూడ పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు


1996-2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

# అపూర్వ సమ్మేళనం

దండేపల్లి, జూన్2 : దండేపల్లిలోని భారతి విద్యానికేతన్ 1996–2001 ప్రైమరీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చదువులు ముగించుకొని భవిష్యత్‌ను వెతుక్కుంటూ వెళ్లిపోయిన విద్యార్థులంతా ఒకచోట చేరి సందడి చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు.


2003-04 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా

సీసీసీ నస్పూర్, జూన్ 2: సీసీసీ సింగరేణి పాఠశాలలో 2003–04 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఆటా పాటలతో హోరెత్తించారు. జలీల్, నరేందర్, మల్లికార్జున్, గౌతమ్, సుధాకర్, రవి, నరేశ్, సమ్మయ్య, జ్యోతి, సృజన, అనిత, కవిత, మాధవి పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రెబ్బెన, జూన్ 2 : రేషన్ డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని రెబ్బెన సీఐ చిట్టిబాబు హెచ్చరించారు. రెబ్బెన మండలంలోని రేషన్ షాప్–4, రేషన్ షాప్–22లను ఆదివారం పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం కొని నిల్వ ఉంచుతున్నారన్న సమాచారం మేరకు వడ్డేపల్లి రాజమణి,శ్రీపతికి చెందిన రేషన్ షాప్–4ను తనిఖీ చేయగా, స్టాక్‌కంటే అదనంగా 9 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అలాగే శంకర్‌లాల్‌జైస్వాల్, సంతోశ్‌జైస్వాల్‌కు చెందిన రేషన్ షాప్–22ను తనిఖీ చేయగా స్టాక్ కంటే అదనంగా సుమరు 11 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అదనంగా ఉన్న బియ్యం సీజ్ చేసి, వారిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.


రేషన్ షాప్‌ను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679